# యోగ్యత

**శ**నివారం సూర్యోదయంతోనే అందరం ఆఫీస్ దగ్గర సమావేశమయ్యాం. రోజుకి పది పన్నెండు గంటల శ్రమ మామూలయిపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లము మేము.

ఆటవిడుపుగా చాలా రోజుల తరువాత పిక్నిక్ ఏర్పాటు చేసుకున్నాం. సరిగ్గా ఏడు గంటలకి ఆఫీస్ దగ్గరనుంచి బస్ బయలుదేరింది. దానితో పాటూ జార్జ్ చేసే సందడీ స్టార్ట్ అయింది.

దాదాపు పాతికమందిమి వున్నాం మేం. నేనూ, శారదా, ప్రియంవదా, విద్యా. మమ్మల్ని మినహాయిస్తే మిగిలినవాళ్లంతా మగవాళ్లే.

పెళ్లికాని పిల్లలు ప్రియంవదా, విద్యా ఒక జట్టుగా తిరుగుతూంటారు. శారదకి పెళ్ళయినా వాళ్ళ వయసు పిల్ల కాబట్టి వాళ్లతోనే కలవాలని చూస్తుంటుంది. లేదంటే జార్జ్‌లాంటి వాళ్ళతో మాట్లాడి మళ్లీ వాళ్లు ఏదైనా జోక్ చేయగానే బిక్కమొహం వేస్తూంటుంది.

ఆఫీసులో ఒంటరిని నేనే. వయసులో కొంచెం పెద్దదాన్ని అవడం వల్లా... మేనేజర్ని అవడంవల్లా చిన్న వాళ్ళు నాతో చనువుగా వుండరు. సెక్షన్‌లో మిగతా మేనేజర్లు ముగ్గురూ మగవాళ్లు అవడం వల్ల వాళ్లూ నాతో ఎక్కువ కలవరు.

నేనొక్కదాన్ని విండోసీట్ దగ్గర కూర్చున్నాను. సింగిల్‌సీట్. పక్కన మరెవరూ లేకపోవడంతో పెద్దగా మాట్లాడుతున్న జార్జ్‌నీ అతని గ్రూప్‌నీ గమనిస్తూ కూర్చున్నాను.

నాకు ముందు సీట్లో శారద కూర్చుని వుంది. తను కథలు వ్రాస్తూంటుంది. రచయిత్రిగా కొద్దో గొప్పో పేరుంది.

జార్జ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ కష్టాల మీద జోక్స్ వేస్తూంటే.. "చాలా రోజుల క్రితం నేనొక కథ వ్రాశానూ... అందులో..." అంటూ ఏదో చెప్పబోయింది శారద.

జార్జ్ టక్కున మాటలు ఆపి కొంచెం భయంగా మొహం పెట్టి "మా గురించా శారదా!" అని అడిగాడు.

"కాదు, కాదు" అంది శారద కంగారుగా. "అందులో హీరో హీరోయిన్స్ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్" అంది.

ఆమె మాట పూర్తికాకముందే "ఓహో చందనా, సురేష్‌ల గురించా! సరే చెప్పు!" అన్నాడు జార్జ్ ఉత్సాహంగా.

చందన, సురేష్ ఇద్దరూ మా కొలీగ్స్. ఇక్కడ చేరాకే ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఇద్దరూ సంవత్సరం పాటు జర్మనీ వెళ్ళారు.

వాళ్లు ఇక్కడ లేకపోయినా శారద కంగారు పడింది. "కాదు, కాదు. వాళ్ల గురించి కాదు. హీరో, హీరోయిన్స్ ఇద్దరూ ఒక సెక్షన్‌లో పని చేయరు" అంది.

"అయితే ప్రమీలా, శరత్‌ల గురించా... చెప్పు చెప్పు" అన్నాడు జార్జ్ ఇంకొంచెం ఇంట్రస్ట్‌గా ముందుకు వంగుతూ.

శరత్ మా సెక్షన్ అయితే ప్రమీల మా ఆఫీస్‌లోనే మరో సెక్షన్. వాళ్లిద్దరూ కూడా ప్రేమించుకుని మొన్నీమధ్యే పెళ్లి చేసుకున్నారు. శరత్ పిక్నిక్‌కి రాలేదు.

అయినా శారద మరింత కంగారు పడి "అబ్బే, కాదు, కాదు. అసలు నా హీరో హీరోయిన్స్ ఇద్దరిదీ ఒక ఆఫీసే కాదు" అంది.

"ఓహో అయితే .... ఈశ్వరూ.. అతని వైపూ అన్నమాట. బాగుంది. చెప్పు, చెప్పు" అన్నాడు జార్జ్ ఇంకొంచెం పెద్దగా. దాంతో శారద బాంబ్ పడినట్టు అదిరిపడి చూసి "కాదు జార్జ్" అంది నీరసంగా.

ఈశ్వర్ కొంచెం సీరియస్‌గా వుండే ప్రాజెక్ట్ మేనేజర్. అతను విన్నాడేమో నని శారద భయం భయంగా అతనివైపు చూస్తుంటే అందరూ నవ్వేశారు.

అప్పటికి తను చెప్పాలనుకున్నది శారద పూర్తిగా మర్చిపోయింది.

నేను నవ్వాపుకుంటూ కిటికీలో నుంచి బయటికి దృష్టి సారించాను. జార్జ్ ఎప్పుడూ ఇంతే. ఏదో ప్రత్యేకించి జోక్స్ వేస్తున్నట్లుండదు. కానీ మాట్లాడే పద్ధతే నవ్వొచ్చేలా వుంటుంది. ఆఫీసులో ఎక్కడ కూర్చున్నా, అయిదు నిమిషాలకొకసారి అతని ఉనికి తెలుస్తూనే వుంటుంది.

అందరూ ఏకాగ్రతతో పనిలో మునిగి వున్నప్పుడు హఠాత్తుగా అతని గొంతు వినిపిస్తుంది. ఏదో ఒక విషయం మీదో లేదా ఎవరో ఒక వ్యక్తి మీదో కామెంట్.

విషయం చాలా మామూలుదైనా.... అతను ఆ వాక్యం పలికే తీరుకే ఫక్కున నవ్వొస్తుంది.

చాలా మోడ్రన్‌గా డ్రెస్ చేసుకునే అమ్మాయి పట్టుచీరలో ఆఫీసుకొస్తే... విరుచుకు పడినంత పని చేసి... "హా! ఏమిటీ దారుణం! చూడలేకపోతున్నాను" అంటాడు.

తను రోజూ వచ్చే తీరుని విమర్శిస్తున్నాడో... ఆ రోజు వచ్చిన తీరుని విమర్శిస్తున్నాడో అర్థం కాక ఆ అమ్మాయి తికమకపడుతుంది.

ఆఫీసులో అతని వ్యాఖ్యానానికి గురవని వాళ్లు లేరు. వర్క్ విషయంలో మాత్రం నాకు అతనితో ఎప్పుడూ ఇబ్బంది కలిగిన గుర్తు లేదు.

నా కన్నా ఓ నాలుగయిదేళ్ళు చిన్నవాడేమో అతను. కానీ ఎమ్.ఎన్.సి. కల్చర్ ప్రకారం "సుచిత్రా, సుచిత్రా" అని పేరు పెట్టే పిలుస్తాడు.

ఒక్కొక్కసారి ఏదో టెన్షన్‌లో వున్నప్పుడు హఠాత్తుగా వచ్చి... "ఇదిగో సుచిత్రా, నేను నీ ప్రాజెక్ట్‌లో పని చేయలేను. ఆసిలోస్కోప్ బాలేదు. సరైన ఎక్విప్‌మెంట్ ఇవ్వకుండా పని చేయమంటే ఎలా చేస్తారు?" అని వాదన వేసుకునేవాడు.

అయితే నేను నా పనుల్లో నుంచి తేరుకుని ఆ సమస్యని పట్టించుకునేంతవరకూ పనేమీ ఆగేది కాదు. కాసేపయిన తరువాత మళ్ళీ ఏమూలనుంచో అతని కేక వినిపించేది.

"సుచిత్రా, నువు చెప్పిన పని పూర్తయిపోయింది. సాఫ్ట్‌వేర్ ఎప్పుడు రిలీజ్ చేయమంటే అప్పుడు చేస్తా" అని.

ఇలా చిన్నచిన్న సమస్యలేమయినా వుంటే ఒక పక్క బెదిరిస్తూ, ఆటపట్టిస్తున్నట్లుగా మాట్లాడుతూ, మరో పక్క ఆ సమస్యల్ని తనంతట తనే సాల్వ్ చేసుకుంటూ పని చేసుకుపోయే జార్జ్‌తో వర్క్ చేయించుకోవడం నాకు హాయిగానే వుంటుంది.

కానీ చాలా మందికి జార్జ్ పనిమీద పెద్ద గురి లేదు. అతనికి ఒక మంచి ఎంప్లాయీగా గుర్తింపూలేదు.

నాతోటి మేనేజర్స్ ముగ్గురికీ అయితే అతనిమీద అసలు మంచి అభిప్రాయం లేదు.

ముఖ్య కారణం అతని మాటలు, ప్రవర్తనే కావచ్చు. అతను దేనికీ భయపడుతున్నట్లుగా కనపడదు. ఏ రూల్స్‌కీ లోబడేవాడిలా వుండడు. సమాజ పరమయిన నియమాలు కావచ్చు. ఆర్గనైజేషనల్ రూల్స్ కావచ్చు.

సిద్ధాంతాలు... ఆదర్శాలు.. ఇలాంటివేవీ జార్జ్ ఎప్పుడూ మాట్లాడడు. 'పుట్టింది సుఖపడడానికే'న్నట్లుగా ప్రవర్తిస్తాడు. విపరీతంగా అనచ్చో లేదో కానీ మొత్తానికి బాగా తాగుతాడని చెప్పుకుంటారందరూ. సిగరెట్లయితే ఆగకుండా కాలుస్తూనే వుంటాడు.

నిజం చెప్పాలంటే నియమాలని గౌరవించని వారిపట్ల నాకూ ఒకరకమైన అసహనం వుంది. మనుషుల మాటలకీ, ప్రవర్తనకీ ఒక పద్ధతి వుండాలని అనుకుంటాను నేను. జార్జ్ దగ్గర ఆ రెండూ లేవు.

అయితే జార్జ్ లాంటి వ్యక్తులని ఇదివరలో ఎప్పుడూ ఇంత దగ్గరగా చూడలేదు నేను. వాళ్ళూ వీళ్ళూ చెప్తే వినడమే కానీ నేను ప్రత్యక్షంగా ఇలాంటి వాళ్ళతో పని చేసింది తక్కువ.

ఇప్పటివరకూ నా టీమ్‌లో అందరూ మర్యాదగా మాట్లాడేవాళ్ళూ, పద్ధతిగా ప్రవర్తించేవాళ్లే వుండేవాళ్లు.. అందుకే జార్జ్‌ని కొంచెం ప్రత్యేకంగా గమనిస్తూంటాను.

గొల్లుమంటూ నవ్వులు వినిపించడంతో ఆలోచనల్లోనుంచి తేరుకున్నాను.

శ్రీధర్ కారు మీద సీరియస్‌గా జోకులు వేస్తున్నాడు జార్జ్. శ్రీధర్‌తో సహా అందరూ హాయిగా నవ్వుతున్నారు.

నవ్వులూ కేరింతల మధ్య బస్ గమ్యం చేరింది. అందరం దిగాం. అదంతా ఓ రిసార్ట్ వాళ్ల ప్యాకేజ్ ప్రోగ్రాం. మొదట బ్రేక్‌ఫాస్ట్... ఆ తరువాత పర్వతారోహణం..

తిరిగి వచ్చాక లంచ్. ఆ తర్వాత దగ్గర్లో వున్న జలపాతం దగ్గరికి వెళ్లడం. బోట్ ట్రిప్స్. అక్కడినుంచి వచ్చాక రాత్రికి మళ్లీ మంచి భోజనం. రెస్ట్. తెల్లవారాక అందరం బయల్దేరి తిరిగి వెళ్లడం. ఇదీ ప్లాన్.

సాయంత్రం వరకూ సమయం చాలా సరదాగా గడిచింది. ముఖ్యంగా జలపాతం చాలా బాగుంది. అక్కడ్నుంచి తిరిగి రావాలని అనిపించలేదు.

చీకటిపడ్డాక ఇక తప్పదన్నట్లుగా వెనక్కి వచ్చాము. గంభీరంగా వుండేవాళ్ళనీ... గలగలా మాట్లాడే వాళ్ళనీ అందర్నీ ఆకర్షించగల శక్తి ప్రకృతికే వుందేమో!

అందరం తిరిగి కాటేజ్ దగ్గరికి వచ్చి, తయారయ్యి భోజనానికి బయల్దేరబోతున్నాం.

నేను కొంచెం ముందు రెడీ అయ్యి విద్యా వాళ్ళ కోసం ఎదురుచూస్తూ నిలుచున్నాను. కొంచెం దూరంలో సిగరెట్ కాలుస్తూ జార్జ్... అతని చుట్టూ మరికొంత మందీ. శారద కూడా అక్కడే నిల్చుని వుంది.

జార్జ్ ఏదో మందుపార్టీ ప్రస్తావన చేసినట్లున్నాడు. కొంచెం తగ్గు స్వరంతో మాట్లాడుకుంటున్నారందరూ. కావల్సిన సరంజామా అంతా జార్జ్ తనతోపాటూ తీసుకుని మరీ వచ్చాడని అర్థమయింది.

"ఏయ్ జార్జ్ అవన్నీ ఇక్కడ కుదరవు. అలాంటివి ఇక్కడ అలౌ చేయరు. ఇది ఆఫీస్ ప్రోగ్రాం" అంది శారద కొంచెం దర్పంగా.

జార్జ్ మరో పక్కకి తిరిగి సిగరెట్ పొగ వదుల్తూ, శారద వైపు పూర్తిగా చూడకుండా "స్కూల్లో అలౌ చేయలేదు. కాలేజ్‌లో అలౌ చేయలేదు. హాస్టల్లో అలౌ చేయలేదు. అప్పుడంతా మేము మానేసి కూర్చున్నామా!" అన్నాడు.

అందరూ నవ్వుతూ చూశారు. "మీ ఖర్మ" అన్నట్లు మొహం పెట్టి శారద వెనక్కి వచ్చింది.

మేమంతా భోజనాలు చేస్తూంటే... జార్జ్ గ్రూప్ ఒక అరడజను మంది మాత్రం టేబుల్స్, కుర్చీలూ తెప్పించుకుని, కాటేజ్‌కి కొంచెం దూరంలో ఆరుబయట వేసుకుని కూర్చుని పార్టీ మొదలు పెట్టుకున్నారు.

పదినిమిషాలు కాగానే సందడి మొదలయింది. దూరం నుంచి గోలగా మాటలూ... నవ్వులూ. మాటలు అర్థం కావడం లేదు. కానీ నవ్వులు మాత్రం అలలు అలలుగా వినిపిస్తున్నాయి.

మాతో పాటు భోజనం చేస్తూన్న మగవాళ్ళందరి మొహాలూ అసహనంగా మారాయి. ముఖ్యంగా మేనేజర్స్. ఈశ్వర్ చిరాగ్గా మొహం పెట్టి "యూస్‌లెస్ ఫెలోస్. ఇలాంటివాళ్ళతో రావడం పొరపాటయిపోయింది" అన్నాడు.

"ఆడవాళ్ళతో కలిసివచ్చామన్న జ్ఞానమన్నా లేదు. చూడండి" అన్నాడు రాజేశ్వర్ ఆశ్చర్యపడుతున్నట్లుగా.

"వ్యసనాలకు బానిసలయినవాళ్లకు అంత ఆలోచన కూడానా!" శశిధర్ నిరసనగా అన్నాడు.

ఆగకుండా కామెంట్ చేస్తూన్న వాళ్ళందరినీ పరీక్షగా చూశాను నేను. వీళ్ళంతా మామూలుగా చాలా మర్యాదగా వుంటారు. ఈశ్వర్ అయితే కొంపలు మునిగిపోతున్నా నోరు విప్పి ఒక్కమాట మాట్లాడడు.

అలాంటిది ఇవాళ ఏమయింది వీళ్లకి? అనిపించింది.

భోజనం పూర్తయ్యేసరికి అందరూ దాదాపుగా ఆగ్రహంతో వూగిపోతూ కనిపించారు. "మనం ఈ స్కౌండ్రల్స్‌ని కంట్రోల్ చేయలేకపోతున్నామే!" అన్నాడు రాజేశ్వర్ బాధపడిపోతూ. ఆ వెనకే మరో ఘోరమయిన పదం ఉపయోగించాడు.

నేను ఉలిక్కిపడ్డాను. ఇందాక ఆడవాళ్లు వున్నారనన్నా చూడకుండా తాగుతున్నారని వాపోయింది ఇతనేనా అనిపించింది. "ఇంత అసహ్యకరమయిన మాటని ఆడవాళ్లముందు ఎలా అనగలిగాడు ఇతను!" చిరాగ్గా అనిపించి లేచి నిల్చున్నాను.

కాటేజ్ దగ్గర్లోనే జార్జ్‌వాళ్ళు కూర్చోనుండడంవల్ల వెళ్లి పడుకోవడానికి కొంచెం ఇబ్బందిగా అనిపించీ... అయినా ఎక్కువమంది ఇక్కడే వున్నారు కనుక సరదాగా కాసేపు మాట్లాడుకోవచ్చుననిపించీ... నిద్రవస్తూన్నా చాలాసేపటినుంచీ ఇక్కడ కూర్చున్నాను.

కానీ వీళ్లకి సరదాగా మాట్లాడే ఆలోచన ఏమీ లేదని అర్థమయిపోయింది కనుక "నేను వెళ్లి పడుకుంటాను" అని కాటేజ్‌వైపు బయల్దేరాను.

నా వెనుకే విద్యావాళ్లు కూడా లేచి వచ్చారు. అందరం కాటేజ్‌కి వచ్చి మా కోసం కేటాయించిన రూమ్‌లో పడుకున్నాం.

లైట్ తీసేసి దుప్పటి ముసుగు పెట్టుకున్నాను నేను. అదేక్షణంలో గుండెలు దద్దరిల్లేలా వినిపించింది ఓ వికటాట్టహాసం. ఆ తర్వాత వెంట వెంటనే తుపాకీ శబ్దాలూ... మళ్ళీ నవ్వూ.. ఆ తర్వాత "తూ భీ బచ్ గయా" అన్న డైలాగు.

అప్పటికి అర్థం అయింది సాగర్ అంజాద్‌ఖాన్‌ని ఇమిటేట్ చేస్తున్నాడని. రెండు నిమిషాలపాటు షోలే సీన్ అంతా కళ్లకి కట్టినట్లుగా చూపించాడు. అందరూ చప్పట్లు కొట్టి అభినందించారు.

ఆ తరువాత సతీష్ అమితాబ్‌నీ, ముత్తు శివాజీగణేశన్‌ని ఇమిటేట్ చేయడం వినిపించింది. భాష నాకు బాగా అర్థం కావడం లేదు కానీ చాలా బాగా చేస్తున్నారని మాత్రం తెలుస్తోంది.

ఒక్కొక్కరిలో వున్న టాలెంట్ విస్మయం కలిగిస్తోంది. వీళ్లల్లో వున్న ఈ సమర్థతని ఈశ్వర్ గ్రూప్ ఎప్పటికీ గుర్తించలేరేమో! టెక్నికల్ వర్క్‌లో జార్జ్ ఎంత సమర్థుడయినా ఆ విషయం గుర్తించడానికి వాళ్ళెవరూ ఒప్పుకోరు.

వాళ్ళదాకా ఎందుకు! జార్జ్‌మీద వాళ్ళకున్నంత అసహనం నాకు లేకపోయినా, నేనూ ఎప్పుడూ గుర్తించాల్సినంతగా అతని ప్రతిభని గుర్తించలేదు.

కొంత ఏజ్ వచ్చాక మనుషులు డిగ్నిఫైడ్‌గా ప్రవర్తించాలన్న ఉద్దేశ్యమే నాకూ వుండేది. ఇదివరకంతా నేను అలాంటి వారిపట్లే ఆకర్షితురాలినయ్యేదాన్ని, అలాంటివారినే గౌరవించేదాన్ని. మిగిలినవాళ్ళందరినీ పెద్ద సమర్ధతలేని వ్యక్తులుగా, పట్టించుకోనవసరం లేని వాళ్ళుగా భావించి కొంచెం దూరంలోనే అట్టేపెట్టేదాన్ని.

కానీ ఈ రోజు తెలుస్తోంది. సమర్ధతకీ, నిగ్రహంతో కూడిన ప్రవర్తనకీ సంబంధం లేదు. సమర్ధత కేవలం ఆసక్తికి సంబంధించిన విషయం. ఎవరికి ఎందులో ఆసక్తి వుందో దాన్ని సమర్ధవంతంగా చేస్తూ పోతూంటారు మనుషులు. ఆ విషయాలు తను నిర్దేశించినవీ, తనకు అనుకూలమయినవీ అయితే మిగిలిన సమాజం ఆ వ్యక్తులని మర్యాదస్థులు, సమర్ధులు అంటుంది. అవి తనకి నచ్చని విషయాలయితే ఆ సమర్ధతని కూడా అసమర్ధతగానే చూస్తుంది.

జార్జ్ లాంటి వాళ్లకి మంచి అనిపించుకోవాలన్న కోరిక లేదు. మేధావులుగా ఎంచబడాలన్న కాంక్ష లేదు. అందుకే సమాజ నియమాలు అనేవాటిని వాళ్లకి నచ్చితే తప్ప పాటించరు.

ఈశ్వర్ లాంటి వాళ్లు మర్యాదస్థులుగా, మేధావులుగా ఎంచబడాలన్న ఆసక్తితో, నిగ్రహంతో కూడిన ప్రవర్తననీ, ఆచితూచి మాట్లాడే విచక్షణనీ ప్రదర్శిస్తారు. నియమాలకు వ్యతిరేకంగా నడిచేవాళ్లని అసహ్యించుకోవడం... దూషించడం కూడా మర్యాదస్థుల చర్యలలో భాగమే కాబట్టి ఆ పనులు చేసే సమయంలో మాత్రం నిగ్రహాన్నీ, విచక్షణనీ వదిలేస్తారు.

అంతే తప్ప నిగ్రహమూ, విచక్షణా వాళ్ళ రక్తంలో జీర్ణించుకుపోయిన లక్షణాలేమీ కావు. వాళ్ళు అవసరాన్ని బట్టి ధరించే ఆభరణాలు మాత్రమే.

గోల ఆపి జార్జ్ గ్రూప్ భోజనాలకి వెళ్ళడం తెలుస్తోంది. ఒక్కసారిగా నిశ్శబ్దమయిపోయిన పరిసరాలు కొత్త పాఠాన్ని బోధిస్తూండగా నిద్రలోకి జారుకున్నాను.

నాలాగా ప్రవర్తించేవాళ్లని మాత్రం సమర్ధులుగానూ, నాకు ఆసక్తిలేని పనులు చేసేవాళ్ళందరినీ అసమర్ధులుగానూ చూడకూడదన్న విజ్ఞానంతో ఆదివారం సూర్యోదయాన్ని సందర్శించాను.

<u>రచనాకాలం : 2000</u>

❖